


www.netifocusnews.com

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

## తెలంగాణ జిల్లాలు

మంగళవారం 13, జనవరి 2026 పేజీలు:4


# పేదలకు అండగా కళ్యాణలక్ష్మి

## ఆడబిడ్డల పెళ్లిళ్లకు సర్కార్ భరోసా..

28 మందికి రూ.28లక్షల పంపిణీ  రాయపర్తి ఊకల్‌లో పల్లె దవాఖానలను ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

## నిరుపేద తల్లిదండ్రులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

గొప్ప పథకం కల్యాణలక్ష్మి,  పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి  తొర్రూరు ఎంపిడిఓ ఆఫీస్‌లో 79మంది లబ్ధిదారులకు రూ.79,09,164 విలువైన చెక్కులు అందజేత

తొర్రూరు/రాయపర్తి, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/మచ్చ శ్రావణ్)-జనవరి 12:

పేద, బలహీన వర్గాల కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మిగతా 2లో..








# ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

### ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క

మహబూబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 13

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. ఎండి గణపతి లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి. అధికారులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించి పోటీ ప్రపంచంలో నిలబడేలా తీర్చిదిద్దే ఉద్దేశంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్సి.ఎస్టి.బిసి రెసిడెన్షియల్ పాఠశాలలలా కాకుండా అందరికీ ఒకే చోట ఉమ్మడి కుటుంబంలా సకల సౌకర్యాలతో పాఠశాలలను ప్రతిష్టాత్మకంగా నిర్మించడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 79 పాఠశాలలు మంజూరు కాగా 76 పాఠశాలలకు టెండర్లు పూర్తి కాబడి 18 పాఠశాలల్లో పనులు మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతి వారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ మిగతా 2లో..



# ప్రజా ప్రభుత్వంలోనే పల్లెల అభివృద్ధి

రూ.2వేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు  పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-జనవరి 12:

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే పల్లెలు అభివృద్ధి జరుగుతాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పర్యటించారు. సోమారంలో హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను, గుడిబండ తండాలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఖానాపురంలో రూ.15 లక్షల ఎన్ ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే సిసి రోడ్ల పనులకు, దుబ్బ తండాలో రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన పంచాయతీ కార్యాలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు, పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి పరచనున్నట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత రహదారులు ఏర్పాటు మిగతా 2లో..






# పేదలకు అండగా కళ్యాణలక్ష్మి

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 28 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ. 28,03,248/- విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆమె స్వయంగా అందజేశారు అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు మహిళల గౌరవాన్ని కాపాడుతూ, సమాజంలో సమానత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, పూర్తి పారదర్శకతతో నేరుగా లబ్ధిదారులకే ఈ ఆర్థిక సాయం అందుతోందని స్పష్టం చేశారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు అంతకుముందు, రాయపర్తి ఊకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ దవాఖానలను ఏర్పాటు చేసిందని ఆమె పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అంతా సానుకూల వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# నిరుపేద తల్లిదండ్రులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

తొర్రూరు, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి /ఓరుగంటి సైదులు)-జనవరి 12:



రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన 79 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ. 79,09,164 విలువైన కళ్యాణలక్ష్మి–షాదీ ముబారక్ చెక్కులను తహసిల్దార్ శ్రీనివాస్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ అవినీతి అక్రమాలకు అవకాశం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న రెండు నెలల్లో చెక్కులు అందజేస్తున్నామని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజలకు ఉచిత సన్నబియ్యం పంపిణీ, నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులు, ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని అన్నారు.పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్ఐ నజీముద్దీన్,ప్రజా ప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వంలోనే పల్లెలు అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

చేసి పల్లెల ప్రగతికి బాటలు వేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో తాగు, సాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేయనున్నట్టు హామీ నిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాలు ప్రజా ప్రభుత్వంలో అందుతున్నట్లు తెలిపారు.పేదలకు సన్న బియ్యం అందించి వారి కడుపు నింపుతున్నామని తెలిపారు. అర్హులకు కొత్త రేషన్ కార్డులు సైతం అందిస్తున్నామని తెలిపారు. నూతన సర్పంచులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయవద్దన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించడం లేదని, రూ.2 వేల కోట్ల అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. విమర్శలకు భయపడబోమని... అభివృద్దే ఏజెండాగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు ముతినేని సోమేశ్వరరావు, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య, డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు,చాపల అనిత బాపురెడ్డి, గంజి విజయపాల్ రెడ్డి, రామచంద్రయ్య, జీనుగా సురేందర్ రెడ్డి,చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, కుందూరు రాజేందర్ రెడ్డి, కుందూరు వెంకటరెడ్డి,విద్యాకర్ రెడ్డి,మహిళా బ్లాక్ అధ్యక్షరాలు పింగిలి ఉష,సర్పంచ్ లు మై పాషా, విజయ లింబ, బానోత్ అభిరామ్ నాయక్, బంగారు రమేష్,కాంగ్రెస్ నాయకులు చిత్తలూరు శ్రీనివాస్, పేరటి యాకూబ్ రెడ్డి,జలకం శ్రీనివాస్, ధరావత్ సోమన్న,తూనం శ్రవణ్ కుమార్, బిక్షం గౌడ్, బచ్చలి లక్ష్మణ్, సోమ్లా నాయక్, అశోక్, సతీష్,పరశురాం, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించాలని, ప్రతి నెలలో కనీసం ఒకసారి పాఠశాలల నిర్మాణాన్ని ప్రత్యక్షం గా తనిఖీ చేయాలని తెలిపారు. పాఠశాల లు నిర్మాణంలో ఉన్న చోట పనితీరు పురో గతిపై డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్య లు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణంపై ప్రత్యేక చొరవ తీసుకొని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియ ల్ పాఠశాలలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యంగ్ ఇండి యా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం విషయంలో జిల్లా కలెక్టర్లు అలసత్వం ప్రదర్శించకూడదని, పూర్తి స్థా యి నాణ్యత ప్రమాణాలతో పాఠశాలలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలి పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలలో విద్యతో పా టు క్రీడలు, సమాజంలో సవాళ్లను ఎదుర్కొనే విధంగా పర్సనాలిటీ డెవలప్మెంట్ తదితర అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఇంచార్జీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, మాట్లాడుతూ జిల్లాలో 2 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు డోర్నకల్ నియోజకవర్గం కురవి మండలం అయ్యగారిపల్లిలో ఒక్కటి, మహబూబాబా ద్ నియోజకవర్గం బొద్దుగొండలో ఒక్కటి మంజూరు కాగా, సంబంధిత పాఠశాలల కు భూమిని కేటాయించడం జరిగిందని, టెండర్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిం దని తెలిపారు, పనులు మొదలు అయ్యా యని, మిగతా పాఠశాలల పనులు కూడా త్వరితగతిన మొదలుపెట్టి వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన చైతన్యమూర్తి వివేకానందుడు

- వనపర్తిలో ఘనంగా 163వ జయంతి
- వివేకానందుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 12:

దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన గొప్ప చైతన్య మూర్తి స్వామి వివేకానందుడని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సోమవారం ఆయన 163వ జయంతిని పురస్కరించుకొని వనపర్తిలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలలకు చాటిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. యువత వివేకానందుడి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద జిల్లా కమిటీ సభ్యులు కోటేశ్వర్ రెడ్డి, భాను ప్రసాద్, పిచ్చయ్య, యాపర్ల రామ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణ గౌడ్ లతోపాటు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి, కృష్ణ, బిజెపి నాయకులు సబి రెడ్డి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, మాజీ కౌన్సిలర్లు బ్రహ్మం చారి, బాపనపల్లి వెంకటేష్, పద్మ పరశురాం, ఎల్‌జసి కృష్ణ, చీర్ల సత్యం సాగర్, యాదగిరి, ప్రముఖ వైద్యులు డాక్టర్ పగడాల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, సత్యశీలారెడ్డి, ఉద్యమ నాయకుడు దేవన్న నాయుడు, ఆశ్రమ నిర్వాహకులు విట్టా శ్రీనివాసరెడ్డి, బాసెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# తీరిన సమస్య

- సొంత నిధులతో తాగునీటి బోరు

భీమదేవరపల్లి, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి ౧౨:

మండలంలోని వంగర గ్రామం నాలుగో వార్డ్‌లో నెలల తరబడి ఉన్న తాగునీటి సమస్యకు గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ సొంత నిధులతో సోమవారం తాగునీటి బోరు వేయించి శాశ్వత పరిష్కారం చూపించారు. ఎన్నికల్లో గెలిచిన కేవలం నెల రోజుల్లోనే ప్రజా సమస్యలపై స్పందించి నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే బోరు ఏర్పాటు చేయించగా, పుష్కలంగా నీరు రావడంతో స్థానికులకు నీటి సమస్య తీరింది. ఈ సందర్భంగా వార్డ్ ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ ప్రజల మౌలిక సదుపాయాలే తన మొదటి ప్రాధాన్యతని, వంగర గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వల్లాల రమేష్, వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# రంగాపూర్‌లో రంగవల్లులు

- యువతకు వివేకానందుడు స్ఫూర్తి
- కాంటెస్టెడ్ సర్పంచ్ సుధారాణి
- రంగాపూర్ లో ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు

వనపర్తి ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 12:

పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామంలో వివేకానంద జయంతి, సంక్రాంతి పండగలను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన రంగవల్లుల పోటీలకు మహిళలు పోటీపడ్డారు. కాంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి సుధారాణి ప్రోత్సాహంతో నిర్వహించిన రంగవల్లుల విజేతలకు బహుమతులు అందజేసి వివేకానంద జయంతి వేడుకలను సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. యువత స్వామి వివేకా నందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.రాంచంద్రారెడ్డి అధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌ఐ యుగేందర్ రెడ్డి పాల్గొని గ్రామస్తులకు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి కాంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి సుధారాణి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ... భారతదేశ ఖ్యాతిని, సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పా రని ఆమె పేర్కొన్నారు.యువత చేతు ల్లోనే దేశభవిష్యత ఆధారపడి ఉంటుందన్నారు. యువతీ, యువకులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శవం తంగా నిలుస్తున్నారన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల నాయకులు, అంగన్వాడి కార్యకర్తలు, బాలికలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జగత్‌పల్లి యువకుడు ఎంపిక

పెద్దమందడి, (నేటి ఫోకస్‌న్యూస్):

జాతీయస్థాయి ఫుట్బాల్ పోటీలకు జగత్ పల్లికి చెందిన కావలి లోకేష్ నాయుడు ఎంపికయ్యాడు. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థి లోకేష్ నాయుడు డిసెంబర్ 11 నుంచి 13 వరకు నల్గొండలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కాగా జనవరి 11 నుంచి 15 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి ఫుట్బాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన లోకేష్ నాయుడును ఫిజికల్ డైరెక్టర్ వినోద్ కుమార్ తో పాటు ఫుట్బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెబ్బేరు కృష్ణకుమార్ రెడ్డి, కోచ్ నాగరాజు అభినందించారు.



## భక్తుల జయజయధ్వానాల మధ్య కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

భీమదేవరపల్లి, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి ౧౨:

మండలం లోని కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ప్రాతఃకాలమున స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యాగశాల లోని నైరుతి వేదిక వద్ద వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తు బలి వంటి వైదిక కార్యక్రమాలు వేదమంత్రోచ్ఛారణల నడుమ ఘనంగా జరిగాయి. తదుపరి ఆలయంలో నిత్య బలిహరణ, నైవేద్య సమర్పణతో స్వామివారి అర్చన భక్తిపూర్వకంగా ముగిసింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, సిబ్బంది, కార్యనిర్వహణ అధికారి పాల్గొనగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి దర్శనం చేసుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

## 14వ జాతీయస్థాయి తెలుగు ఆహ్వానిత నాటిక పోటీలు

తొర్రూరు, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-జనవరి 12:

ప్రతి సంవత్సరం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పరిధిలో జాతీయస్థాయిలో తెలుగు ఆహ్వానిత నాటిక పోటీలను చైతన్య కళా సమాఖ్య తొర్రూరు అంగరంగ వైభవంగా నిర్వహించడం విధితమే.. ఈ సంవత్సరం కూడా 14వ జాతీయ స్థాయి తెలుగు ఆహ్వానిత నాటిక పోటీలను మార్చి నెల 9,10, 11,12,13–2026 తేదీలలో ఐదు రోజులపాటు అత్యద్భుతంగా పేరొందిన రంగస్థలం కళాపరిషత్తుల నాటికలను ఆహ్వానిస్తూ ఏర్పాటు చేయడం జరిగినది... ఈ విషయాన్ని సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానిస్తూ సంస్థ అధ్యక్షులు మన్నూరు ఉమ, వర్కింగ్ ప్రెసిడెంట్ జినుగ సురేందర్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ మంగళపల్లి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ సుంకరనేని పినాకపాణి వారి కార్యవర్గ సభ్యులు ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు..



## అంగన్వాడీ టీచర్ల నియమించాలి

భీమదేవరపల్లి, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి12:

మండలంలోని భీమదేవరపల్లి కేంద్రంలో అంగన్వాడీ భవనాలు, విద్యార్థులు ఉన్నప్పటికీ టీచర్లు లేరని సర్పంచ్ మాచర్ల కుమారస్వామి సీడీపీవో స్వరూపను కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి బాలింతలు, గర్భవతులు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లను వెంటనే నియమించి చిన్నారుల విద్యా, పోషణ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు.

# కాట్రపల్లిలో ఘనంగా వివేకానంద జయంతి

- ముఖ్య అతిథిగా పరుపాటిశ్రీనివాస్ రెడ్డి

రాయపర్తి, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/మచ్చ శ్రావణ్ రాయపర్తి)-జనవరి 12:



భారతదేశ యువతకు స్ఫూర్తిప్రదాత, ఆధ్యాత్మిక శిఖరం స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలు రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీ స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహ దాత, SRR ఫౌండేషన్ చైర్మన్ మరియు బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పరుపాటి శ్రీనివాస్ రెడ్డి స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లేవండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకు విశ్రమించకండి అన్న వివేకానందుడి నినాదం నేటి యువతకు దిక్సూచి అని కొనియాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జినుగు అనిమిరెడ్డి రాయపర్తి మాజీ ఎంపీపీ రాపాక పద్మ స్థానిక సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య మాజీ సర్పంచ్ ఎండీ అన్వర్ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్రబోయిన శ్రీనివాస్ వివేకానంద యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు చెన్నబోయిన విజయ్ కుమార్ యూత్ అధ్యక్షులు కత్తి సుధాకర్ ఉపాధ్యక్షులు వీరితో పాటు పార్టీ ముఖ్య నాయకులు సంధి దేవేందర్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, ఐత జంపి మరియు పెద్ద ఎత్తున యువజన సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. యూత్ అసోసియేషన్ సభ్యులు విగ్రహ ఏర్పాటుకు సహకరించిన పరుపాటి శ్రీనివాస్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



# యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

- మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్
- అలరించిన లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు
- జిల్లెలగూడలో ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు

మీర్ పేట్, (నేటి ఫోకస్‌న్యూస్)-జనవరి 12:




భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని మీర్ పేట్ కార్పొరేషన్ 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకొని వివేకానంద క్రాస్ రోడ్ జిహెచ్ఎంసి జిల్లెలగూడ.. మీర్పేట్ దగ్గర స్వామి వివేకానంద విగ్రహానికి మాజీ ఎంపీటీసీ ఎనుగుల అనిత అనిల్ కుమార్ యాదవ్ తో కలసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు అబ్బురపరిచి అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి రాష్ట్ర బంజారా నాయకులు మూడవత్ దీప్ లాల్ చౌహాన్, లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ మాజీ కార్పొరేటర్ సిద్దాల లార్డ్స్ బీరప్ప, వైస్ చైర్మన్ బి. శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, దోమలపల్లి ధనలక్ష్మి రాజ్ కుమార్, ఉయ్యాల నవీన్ గౌడ్, సిద్దాల పద్మ అంజయ్య, మాజీ టెంపుల్ డైరెక్టర్లు మేకల యాదగిరి, సుర్విలత శేఖర్ గౌడ్, జ్ఞానేశ్వర్ చారి, జంగయ్య, దయానంద్ ముదిరాజ్, గోపి యాదవ్, హతిరాం నాయక్, బుచ్చిరెడ్డి, రవీందర్ రెడ్డి, సత్యం, నరసింహ, విజయభాస్కర్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, రూప్ కరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సంక్రాంతి క్రికెట్ సంబరాలు

- సర్పంచ్ దుంపల శ్రీదేవి, కుమారస్వామి

పెద్దవంగర, (నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి/ఓరుగంటి సైదులు)-జనవరి 12:

పెద్దవంగర మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో స్పోర్ట్స్ యూనియన్ వారి ఆధ్వర్యంలో ఉత్సాహంగా సంక్రాంతి క్రికెట్ మండల స్థాయి కబడ్డీ పోటీలు సర్పంచ్ దుంపల శ్రీదేవి కుమారస్వామి ప్రారంభించారు. అనంతరం వారు క్రీడాకారులను కలిసి వారికి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రికెట్ వంటి క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీరం ఫిట్ గా ఉంటుందని తెలియజేశారు. సంక్రాంతి పండుగ వేళ క్రీడలు ఆడటం వల్ల ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరిస్తూ జట్టుగా కలిసి పనిచేయడం వల్ల యువతలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గ్రామ యువత వ్యాసనాలకు దూరంగా ఉండి క్రీడలపట్ల అసక్తి చూపాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవర్ధన్, సీఏ మేనక, రమ, వేణు, సాయి సాంబి, సోమా సాంబయ్య, వెంకన్న, నీలం సాంబయ్య, శ్రీరాం సాంబి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.







## ధర్మారంలో యువకుడి మృతదేహం లభ్యం

భీమదేవరపల్లి, (నేటి ఫోకస్‌న్యూస్)--జనవరి 12:

మండలం లోని ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల అశోక్ (19) అనే యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన విషాదాంతంగా ముగిసింది. ఈ నెల 6న తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లిపోయిన అశోక్ కనిపించడంలేదని 7న అతని తండ్రి పిట్టల సురేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ఈ నెల 12న మధ్యాహ్నం ధర్మారం నుంచి మంచినీళ్ల బండకు వెళ్లే రోడ్డు పక్కన గుట్టలలో అశోక్ మృతదేహం కుళ్లిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లతో అక్కడికక్కడే శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.